# నిలువుటద్దం

జి. పార్వతి

పెద్ద కథ

పూజామందిరంలోంచి గంట విన పడగానే పిల్లలంతా తోసుకుంటూ లోపలికెళ్ళి వరుసగా తీర్చి కూర్చున్నారు. ముసలావిడ మనవలందర్నీ ఒక సారి చూసి నవ్వుకుంటూ ప్రసాదం పళ్లెం తీసింది. కూర్చున్న వాళ్ళలో ఉలుకూ పలుకూ లేకుండా కూర్చునేది చిన్నాయనకూతురు చిట్టి, పెద్దాయన పెద్దవాడు శంకర్రావు మటుకే. పెద్దాయన రెండో కొడుకు బాబు వాడిపైది గిరిజ మటుకు తోడు దొంగలు.

పెద్దాయన గుమ్మంలో చేతులు కట్టుకుని అంతా చూస్తున్నారు. ఆయనకి పార్టీలతో మాట్లాడుతూండగా మధ్యలో కొంత ఉపశాంతి కోసం, లేక మాట తోచనప్పుడుగాని లోపలగా వచ్చి తల్లితో కొంత ముచ్చటించి పోతూంటారు. దాంతో ఆయన తలంతా మంచి ఆలోచనలువచ్చి పని రైటవుతుంది.

"ఇవాళ దైవ నివేదనకు నువ్వు సిద్ధమయా వన్న మాట."

"నీ ప్రసాదం తిని మేమంతా వృద్ధిలోకి వస్తున్నామమ్మా ... పైగా యిది తిన్నతరువాత ఏ రోగమైనా కూడా నయమవగలదని నా నమ్మకం..." అని నవ్వాడు. పెద్దాయనలో ఎంత గంభీరభావం ఉందో అంత మంచితనమూ వుంది. తన ఆఫీసుగది దాటి ఏ ఒక్క క్షణమూ బయటికి రారు. పైగా రావాలన్నా పార్టీలు ఒదలద్దూ! ఇంట్లో అందరూ అంటే దాసదాసీలు తల్లి కూడా పెద్దాయనంటే బితుక్కు మంటూరు. మరదళ్ళు ఎప్పుడూ ఆయన ఎదుట పడనేపడరు. ఆటువంటి ఆవశ్యకత వుంటే పక్కకి తప్పుకుని వెళ్ళిపోతారు.

మధ్యాహ్నమయిందో లేదో పెద్దాయన ఒళ్లు నలతగా వుందని విశ్రాంతిగా పడుకున్నారు. ఈ లోగా బాబు, గిరిజ పక్క ఆఫీసుగదిలో బల్లంతా సిరా ఒలక బోసి ఒళ్ళు సిరాతో పాడుచేసుకుని ఆ తప్పును ఎలా దాచాలాని ఆలోచనలు జరుపుకుంటు న్నారు. పెద్దావిడ నెత్తి నోరు బాదుకుంటూ బయటికీడ్చింది. పెద్దాయన యీ గొడవవిని యివతలికొచ్చి యిద్దరి రెక్కలు పుచ్చుకు యీడ్చి దొడ్లో పడవేసి వీపు పగిలేట్లు బాదారు. తల్లి ఎంత వారించినా వినలేదు.

"లక్ష్మీ!...పిల్లలంటే ముద్దుగానే చూడాలని కాదు. అవుసరమైతే యిలాంటి దెబ్బలు పడ్తూండాలి. దానివల్ల వాళ్ళ ఒంటిబంగారం వూడిపడదు" అని నడుముకు చేతులెట్టుకుని చూస్తూ నుంచు న్నారు. ఇంక ముసలావిడ, కోడలు ఒకరిమొహాలు ఒకరు చూసుకుంటూ నుంచున్నారు. వాళ్ళకి ఎది రించే ధైర్యం వాళ్ళని ఓదార్చే ధైర్యం లేవు.

"మీరు ఆ గదిలోకి యింకెప్పుడు వెళ్ళనని స్పష్టంగా అంటే లోనికి రానిస్తాను..." అనే సరికి యిద్దరూ కళ్లునలుపుకుంటూ తప్పును ఒప్పు కున్నారు.

సీను యీమధ్యనే వుద్యోగంకోసం తాపట్లాడి యిల్లు చేరాడు. బి. కాం. ప్యాసయిన వాడికి పెద్ద వుద్యోగాలురావనీ, తను పెద్దవుద్యోగం చేతబడి నప్పుడే చేయాలని అతని సంకల్పం. పొద్దుట ముసలావిడ కూరలు ఏవి చెయ్యాల్సినదీ వంటావిడకు ఎంచిపెడ్తూంటే పక్కగావెళ్ళి కూర్చున్నాడు.

"అమ్మా! నా వుద్యోగంమాట, ఎలావున్నా వూళ్లుమాత్రం చూసిరావటమయింది. అదుగో

చూడు, నువ్వెప్పుడూ పెద్దన్నయ్యకు యిష్టమయినవి వండించాలనేగాని నామాట ఒక్క రోజు ఆలోచించావా!..." అని అనేసరికి చిన్నావిడ అంటే శశి మరిదికేసి చూసి నవ్వాపుకుంటూ అంది "కేశవకీ, నీకు మీ అమ్మగార్ని చూస్తే ఏదో ఒకటి అనాలనిపిస్తుందేమో! బావగారు అట్టే మాట్లాడరు గనుక ఆయన్ని కనిపెట్టాల్సినభారం అత్తగారిది. యిక మీ చిన్నన్నయ్య అన్నావా ఆయనకి ప్రపంచకమే లేదు. నువ్విలా తగవులాడుతూంటే నీ నోరే బయటపడేది."

"చూడు ఒదినా...చిన్నన్నయ్య దేముడు... వాడికేది యిష్టమో మనకే తెలీదు. ఇకపోతే అమ్మ నా గురించయినా కనిపెట్టదు. ఒక్కనాడన్నా అడిగావా అమ్మా!" అని తల్లికేసి నవ్వుతూ చూశాడు. తల్లి విన్పించుకోనట్టు లేచింది. సీను వున్నాడు చూశారూ...వుత్తవాగుడు రకం. ఎప్పుడూ ఒదినగార్నీ తల్లినీ అంటూంటేగాని వూరుకోడు. తల్లి యిలాటి అనవసరపు ప్రసంగం విని మానందాల్చేది: యిదెప్పుడూ మామూలే!

ముసలావిడ యీ నల్గురు పిల్లల్నిచూసి ఒక విధంగా చాలా గర్వపడేది. పెద్దాయన ప్లీడరీ చేస్తూ ఆస్తినీ యింటినీ నిల్పుతున్నారు. రెండో ఆయన కంపెనీలో మామూలు వుద్యోగం చేస్తున్నారు. మూడోవాడు సీను అయితే ప్రధాన మంత్రి కావాలి లేకపోతే వూరుకోవాలనే రకం. కేశవుడు యీమధ్యనే విశాఖపట్నంలో చదువుతున్నాడు.

* * *

కేశవుడు సెలవులకి వచ్చాడు. యింట్లో అందరూ పండుగ తొందర్లో వున్నారు. పెద్దావిడ బట్టలు లేవటమూ కుట్టించడంలో వున్నారు. సీను కార్డు తెచ్చి తల్లిచేతికిస్తూ అన్నాడు.

"నాకు అత్తవారింటినుంచి పిలుపొచ్చిందమ్మా, యింక రెండు రోజుల్లో సీతను తీసుకుని మెడ్రాస్ వెళ్ళాలనుకుంటాను. నాకైతే యిక్కడే వుండాలని వుందిగాని కేశవుడితో మా బావమరిది చాలా గట్టిగా చెప్పాడుట."

"మొదటి సంవత్సరం వెళ్ళకపోతే బాగుండదు సీనూ...దానితో రేపో ఎల్లుండో వెళ్ళి వెంటనే పండుగ మర్నాడు వచ్చేయండి. నేనా గది ఖాళీగా, ఎన్నాళ్ళో చూడలేను" అని అంది.

కేశవుడు మూడో ఆవిడ్ని యిట్టే వుడికిస్తాడు. "సీతా, మీ అన్నగారు మొన్న కన్పించి హోటల్లోకి లాక్కుపోయాడు. ఏదో సామ్యంచెప్పినట్టుగా రూపాయన్నర ఆముదం నాకే తగిలింది. అన్న మరిదికదాని వూరుకున్నాను." అని నవ్వాడు.

"ఏంసీతా!...నీ తమ్ముడు యింద్రుడు, చంద్రుడని పొగుడుతూంటావు తెలిసిందా..." అని భర్త అనేసరికి మరీ అభిమానపడింది.

"మావాళ్ళు ఎలాగూ లేనివాళ్ళే...మీలాటి పెద్ద ఆస్తిపరులైతే మీదాకా రావటందేనికి" అంది. కేశవుడు నాలుక కరుచుకుంటూ వెళ్ళిపోయాడు.

పండుగనాడు మధ్యాన్నం అందరూ కొత్త బట్టలు కట్టుకున్నారు. కేశవుడు స్నేహితులతో ఎక్కడికో వెళ్ళిపోయాడు. చిన్నాయన గదిలో పుస్తకం చదువుకుంటున్నారు. తోటి కోడళ్ళిద్దరూ అత్తగారికి నమస్కరించి పక్కగా నుంచున్నారు. శశి గబగబా బావగారికి నమస్కరించాలని వెళ్ళింది.

"మీకు శశి నమస్కరించాలని వచ్చింది."

"ఆ భగవంతుడు, అమ్మా, దీవిస్తే చాలు. నాకెందుకమ్మా నమస్కారం!..." అంటూ పంచె కుచ్చెళ్ళు సర్దుకొన్నారు. శశి నమస్కరించి తోటి కోడలి కాలిమీదకు వంగింది.

"అదేమిటే శశీ!...నీకు పిచ్చిగాని పట్టలేదు కదా!...ఒద్దు లేచిపో..." అంది వెనక్కి జరుగుతూ. శశికిదంతా అవమానంగాతోచి వెళ్ళిపోతూ అంది "నువ్వెలాగూ నాకన్నా పెద్దదానివని చేశానక్కయ్యా ... అంతకన్నా మరేమీ తప్పుపని కాదు..." అని లేచివెళ్ళి గదిలో పడుకుంది.

పెద్దావిడ యీమాట అనటంతో భర్త నిశ్చేష్టుడై అట్టే నిల్చుండిపోయారు. గబగబా శశి గదిలోకెళ్ళి అంది "అంతలోకే కోపమెందుకే శశీ...కాఫీపొడుం ఎంతవెయ్యాలి?"

"కాఫీ గిన్నె నిండుతే అయిదు చెంచాలు చాలు..." అంది అటే తిరిగి. పెద్దావిడ తనవేపు తిప్పుకుంటూ అంది "యిదిగో నీయిష్టమొచ్చినన్ని మార్లు నమస్కరించు...వారిద్దరిలో నాకు సిగ్గనిపించి అలా అనాల్సి వచ్చింది...నీకు కోపంవచ్చే

మాట ఎప్పుడైనా అన్నానా చెప్పు..." అంది ప్రాధేయపడ్తూ.

"నిన్ను కష్టపెట్టాలని నా సంకల్పం కాదు అక్కయ్యా. నువ్వెలాగూ నాకన్నా అన్నింటిలోనూ పెద్దదానివి. నీ దీవన కావాలని ఆశ..." అంది. తోటికోడళ్ళిద్దరూ మళ్ళా మామూలులో పడి పనిలోకి దిగారు. తమ్ముడి పెళ్ళాం వచ్చిందగ్గర్నుంచి ఆవిడ చేతిమీదుగానే పెద్దాయన కాఫీ తాగుతున్నారు. పొరపాటున మరెవరైనా చేస్తే వెంటనే పసికట్టి చెప్తారు. అందుచేత శశి రెండు వేళలా కాఫీలు కలపక తప్పదు.

* * *

మధ్యాహ్నం శశి ఒక్కపరుగున అత్తగారి దగ్గరకొచ్చి రుద్ధకంఠంతో చెప్పింది. "అత్తగారూ! పిల్లాడు మూసిన కన్ను తెరవటంలేదు. నాకేమో చాలాభయంగా వుంది..." అని ఆనేసరికి ముసలావిడ కొంగు పైనవేసుకుంటూ వెళ్ళింది. పిల్లాడి కడుపు వుబ్బరించి వుంది. పైగా వాడు పుట్టిననాటి నుంచి ఏదో ఒక జబ్బు తిరగబెడ్తూనేవుంది. పిల్లాడు తండ్రిలాగు చాలా అర్భకుడు.

దాసీ దానిచేత కుంపటి నిప్పులు తెప్పించి కాపిస్తోంది. యింతసేపూ శశి ఏడుస్తూనేకూర్చుంది పిల్లాడ్ని అత్తగారి చేతులో పెట్టి. పెద్దావిడ పిల్లల నోటిమీదుగా విని తొందరగా వచ్చింది. "వుండవే శశీ!...నువ్వలాగున బాధపడకు. అత్తగారూ, నేనూ చూస్తూనే వున్నాంగా!..." అని తోటికోడల్ని దగ్గరకి తీసుకుంది.

"యింకా పిల్లాడు బతకడమ్మా అక్కయ్యా. ఎప్పుడూ రోగమేనాయె"

"శశీ!...పిల్లలకి రోగాలు ఎంత తొందరగా వస్తాయో అలాగే నశించిపోతూంటాయి. వాళ్ళని దైవమే కాస్తూంటాడు..." అని అత్తగారు అక్కడే కూర్చున్నారు. సాయంత్రం పెద్దాయన ఎందువల్లనో పెందరాళే వచ్చారు. ఈ మాట తెలియగానే డాక్టర్ని తెచ్చి చూపించారు.

చిన్నాయన ఆఫీస్‌నుంచి రాగానే గదిలో తల్లినీ, భార్యనీ చూసి విస్తుపోయారు. పిల్లాడి పక్కగా శశి పడుకునివుంది. ముసలావిడ చాప మీద కూర్చుని భారతం పఠిస్తోంది. కొడుకుని చూడగానే మెల్లగా అంది "యివాళ చంటాడికి కొంచెం ఒళ్ళు కాగుతోంది. అన్నయ్య డాక్టరుకి చూపించాడు. శశి బేజారైపోయి గోలగావుందని యిక్కడే కూర్చున్నాను...నువ్వు వచ్చావుగా! యింక నే వెళతాను" అని లేచింది. పెద్దావిడ మరిదికి కాఫీ తెచ్చి యిచ్చింది.

"యివాళ మీ అన్నయ్య గుంటూరుప్రయాణం మానివేశారోయ్ నారాయణరావు..."

"పిల్లాడికి నయమౌతుందమ్మా ఒదినా. అన్నయ్యను బయల్దేరి వెళ్ళమను..."

తోటికోడల్ని ఒకసారి చూసి వెళ్ళిపోయింది.

* * *

సీను భార్యను తీసుకుని యింటికి చేరుకున్నాడు. ఇప్పుడతను వుద్యోగాన్ని గురించి మహా పట్టుదలగా మాత్రం వున్నాడు. మధ్యాహ్నం భోజనాలయాక చిన్న అన్నగారి గదిలో కెళ్ళాడు మాట్లాడటానికి. ఒదినగారు యీనెలు తీస్తోంది తమలపాకులకి. మరిదిని చూసి పక్క మీంచి లేచి కింద కూర్చుంది.

"చిన్నన్నయ్యా! ... నీతో మాట్లాడాలని వచ్చాను. నువ్వు ఆ మధ్యన కృష్ణారావు సంగతి ఏదో చెప్పావు. నేను రేపు బయల్దేరి కలకత్తా వెళదామని చూస్తున్నాను. అతను నా కేదైనా సహాయం చేయగలడంటావా?"

"అతను తప్పకుండా చేస్తాడనే నా నమ్మకం. నా చిరకాల స్నేహితుడు... నేను వుత్తరం రాసిస్తాను. నువ్వు వుద్యోగం చిన్న పెద్ద వివక్షత పెట్టుకుంటేమటుకు పని జరగదు...!" అని అనడంతో సీను నవ్వుతూ అన్నాడు "యింకీమాటు అలా చేయనురా ... ఎక్కడో ఒకచోట స్థిరపడే వుద్దేశ్యం మీదే వున్నాను" అని ఒదినగార్ని పలకరించి వెళ్ళాడు.

సీను మర్నాడు ప్రయాణమయ్యాడు. ముసలావిడ నాల్గయిదు మిఠాయి వుండలు పొట్లాం కట్టిపెట్టింది. వెడుతూ పెద్దన్నగారికి తల్లికి నమస్కరించాడు "ఏమిట్రా యింకా స్థిరపడాలిగా! ఈ పిచ్చి చాదస్తమేమిటి?" అని నవ్వారు.

సీత యివాళ చాలా బాధపడ్తోంది. భర్త వెళ్ళటం ఏమంత బాధకరమైనది మటుకు కాదు. కాని ఏ వుద్యోగం లేకుండగా యిన్నాళ్ళుగా యింట్లో కూర్చుంటే తను వూరికే ఎవరి సొమ్మో

నోల్లును తింటోనట్టుగా బాధపడింది. పుట్టింట్లో ప్రతివాళ్ళు తన భర్తని వేళాకోళం చేస్తే తనా పాటున బుర్ర బద్దలయి చావాలనుకుంది. సందేహ నివారణార్థం చిన్న బావగారి గదిదాకా వెళ్ళింది.

"ఏమే సీతా!...యిలావచ్చావ్ ..." అని అంది చిన్నావిడ. చిన్నాయన లేచి కూర్చుని మరదల్ని నవ్వుతూ ఆహ్వానించారు.

"ఏమీ లేదక్కయ్యా...వారు వెళ్ళింది మంచి పనపునో కాదో బావగార్నడిగి తెలుసుకోవాలని వచ్చాను..."

"మీ మరదలు సీను విషయం మాట్లాడాలని వచ్చింది...పాపం మిమ్మల్ని చూసి బెదిరిపోతుందల్లే వుంది..." అని పకాలున నవ్వింది.

"ఏమ్మా! నీకాసందేహం ఎందుకు కల్గింది? పని మంచి చెడ్డలని నిర్ణయించటానికి ఏదీలేదు. అంతా ముందు చిన్న వుద్యోగస్థులుగానే చేర్తారు. చదువు కన్నా అనుభవం ముఖ్యం...యీ వరుసని చూస్తే సీను అక్కడ వుద్యోగంలో పాతుకుంటే మంచి మాట..."

"ఆయన వొదిలిచ్చేస్తారేమోనని భయంగా వుంది. మీ దగ్గర ఆయనకి భయంకూడా వుందను కుంటాను. కాస్త కూకలేస్తూ వుత్తరం రాయమని చెప్పేందుకే వచ్చాను..." అని తల దించుకుంది.

"అదేనమ్మా ... నేనూ ఆలోచిస్తున్నాను. కృష్ణరావు వస్తుందని చెప్పి రాశాడు. వీడు వుంటాడో లేదో ననే భయంగా వుంది. నేను గట్టిగా రాద్దామనే అనుకుంటున్నాను" అని అనే సరికి తృప్తిపడి లేచి వెళ్ళింది.

మర్నాడు సీను దగ్గర్నుంచి వుద్యోగంలో చేరినట్టు వుత్తరం వచ్చేసరికి అందరూ విస్మయం చెందారు. పెద్దావిడ నవ్వుతూ తోటికోడలితో "సీతా! సీనుని ఏమని కేకలేసి పంపావే అక్కడ చేరిపోయాడు?"

"చిన్న బావగారి చీవాట్లు పనిచేసినట్టున్నాయి అక్కయ్యా!" అని నవ్వటం ప్రారంభించింది.

ముసలావిడకు రాత్రల్లా నిద్రపట్టింది కాదు. పిల్లలు నలుగురూ తనదగ్గిర వుంటే ఆదొక అహం కారంగానూ, ధైర్యంగానూ వుండేది. అందువల్లనే రెండో కొడుకు ఇంజనీరే కావాలని కోరుకున్నా లెఖల బి. ఏ. మటుకు చదివించి వూళ్ళో పనికి ఒప్పించింది. పైగా ఆయన చాలా అర్భకుడు కూడా...యిటువంటి పరిస్థితిలో పెద్దాయన దగ్గరగా, చిన్నతను వుండటమే నయమనిపించింది.

పెద్దాయన అత్తవారు చాలా వున్నవాళ్ళు. లక్ష్మికి అంటే పెద్దావిడకు తండ్రి లేడు. తల్లి అన్నగారు మటుకు మిగిలి వున్నారు. చిన్నావిడకు సాతికల్లిపైగా ఆయన పోస్టుమాస్టరీ పనిలో ఎంత బాగా బతికిపోతున్నారో గ్రహించండి! పెద్దావిడ అన్నగారు పిల్లాడి పుట్టివెంట్రుకలు తీయించడానికి చెల్లెల్ని రమ్మని పిల్పించాడు. పెద్దావిడ వెడుతూంటే ముసలావిడ చాలా వ్యథపడింది. తన ముగ్గురు కోడళ్లు, కొడుకులే తన ప్రపంచకం.

"లక్ష్మీ!...నువ్వు రెండు మూడు రోజుల్లో వచ్చేయాలి. శశికి కూడా నువ్వు లేనిదే తోచదు. ఇక సీత ప్రయాణం దగ్గరపడుతోంది" ఈ మాటకు పెద్దాయన నవ్వుతూ అన్నారు "పుట్టింటికి వెళ్ళిన తరువాత మనం దాని కంటికి ఆనొద్దూ! నేను రాలే దని మీ అన్నని కోపగించుకోవద్దని చెప్పు. నాకు పని తీరికలేకుండగా వుంది" అని అన్నారు. పెళ్ళి అయినతరువాత ఒక్కమారు అత్తవారింటికి పోలేదు పెద్దాయన. పెళ్ళిలోనే బావమరిది, అత్తగారి వరస కనిపెట్టారు. వాళ్లుచేసిన స్వల్ప మర్యాద వారికి తక్కువనిపించింది. ఆలాని భార్యతో ఎత్తిపొడుపుగా అనే వుద్దేశ్యంమటుకు లేదు. మనిషి విలువలు కనిపెట్టిన తరువాత దాన్ని అనుసరించటమే మానవ ధర్మం! యిదీ ఆయన వుద్దేశ్యం.

* * *

సీత తన గది కిటికీలోంచి చూసేసరికి దొడ్లో పెద్దపొగ చుట్టబెడుతోంది. వెళ్ళి చూసేసరికి గడ్డిమంట ప్రారంభమయింది. నౌఖర్ని పిల్చి బాల్చీలతో నీళ్లు పోయించేసరికి కొంత నయమయింది. పిల్లలుమటుకు అక్కడ కన్పించలేదు. చిట్టి వాళ్ళమ్మ దగ్గర చదువుకుంటోంది. ఎటొచ్చీ పెద్దావిడ పిల్లలిద్దరూ ఎక్కడా కన్పించడంలేదు. పక్కవాళ్ళందర్ని అడిగి తెల్సుకుని వచ్చారు. ముసలావిడ కోడళ్లు ఒకే కంగారుగా వున్నారు.

పెద్దావిడ మంచంకిందున్న బాబు, గిరిజ సీత కంటపడ్డారు. వాళ్ళను మెల్లగా పిల్చి తన గది లోకి తీసికెళ్ళింది. యింక పెద్దావిడ కోపానికి

పొద్దు లేకపోయింది. "సీతా! పిల్లల్ని వదిలిపెట్టు, వారి నాన్నగారుంటే యీపాటికి దాని అంతం చూసేవారు..." అని పిల్లల్ని లాక్కొని గట్టిగా కొట్టి తను గదిలోకెళ్ళి ఏడుస్తూ పడుకున్నది. పిల్లల అల్లరిలో ఎక్కడా శాంతం లేకుండా పోతోంది. ముసలావిడ పిల్లల్ని దగ్గరే పెట్టుకుని కొడుకు రాగానే అంతా మెల్లిగా చెప్పింది "వీళ్ళిద్దర్నీ యింక గదిలో గొలుసుల్తో బంధించాలనుకుంటాను..." అని విసుగ్గా అన్నారు.

సీత ప్రయాణం దగ్గర పడింది. బావమరిదితో చెల్లెల్ని తీసుకురమ్మని రాశాడు సీను. ముసలావిడ కొంత సామాను అవి చేర్చి ప్రయాణానికి సిద్ధం చేసింది.

"సీతా!... నువ్వు యింకీమాటు పిల్లాడిని ఒళ్ళో పెట్టుకునే రావాలిసుమా!..." అంది చిన్నావిడ వేళాకోళంగా. ముసలావిడ మనసంతా వికలమైంది.

"మగవాళ్ళకి డబ్బు సంపాదనే గాని, జాగ్రత్త తెలీదు సీతా!...ఇంట్లో లోటుపాట్లు కనిపిస్తే అందరూ ఆడదాన్నే అంటారు. ప్రపంచంలో మంచి మనుష్యులు చాలా తక్కువ...అలా అనిపించుకునేందుకు మటుకు నువ్వు ప్రయత్నించాలి..." అని అత్తగారు అనే మాటలు వింటూ కోడలు కంట తడిపెట్టుకుంది.

"నాకు పుట్టింట్లోను యిక్కడా కూడా నలుగురితో బతికే అలవాటయింది అత్తగారూ... ఇవాళ నేను ఒంటరిదాన్ని వెళ్ళి తెలీని కొత్త స్థలంలో ఎలాగ మసులుకోవాల్సి వుందో అర్థం కావటంలేదు. ఏది ఎలావున్నా మీరు మటుకు తప్పకరావాలి..."

"నేను రావటం వీలుపడదమ్మా... నేనొక స్థిర పడిన పర్వతాన్ని...నన్ను ఆ భగవంతుడే కదిపి తీసుకుపోవాలి...ఎక్కడున్నా మీరు ఆయురారోగ్యాలతో వుండాలనే తెల్లారి భగవంతుణ్ణి ప్రార్థించేది!..." అంది.

బాబు, గిరిజ సీత దగ్గిర చాలా అలవాటయింది. వెళ్ళిపోతూంటే ఒకటే ఏడుపు, గొడవ చేశారు. వర్షం బాగా ఎక్కువగావుంది. యివాళే ముసలావిడ మనసుకూడా కుదురుగాలేదు. దేవుడి గది ద్వారంమీద తల పెట్టుకుని పడుకుంది. మధ్యాహ్నం కోడళ్ళిద్దరూ కంగారుగా వచ్చారు.

"అత్తగారూ!...మీరివాళ భోజనానికి లేవనే లేదనుకుంటానే ... మీ వొక్కరికే కాదు, మాకూ మీఅంత వేదనగానూ వుంది. వాళ్ళూ అలాగే బాధపడ్తారు. చూడండి...మీరు లేకపోతే వారిద్దరూ బాధపడ్తారు. అందులో బావగారికి మరీ కోపం వస్తుంది..." అంది పక్కగా కూర్చుంటూ...

"నేను బెంగచేతకాదు శశీ పడుకున్నది... నాకు పొద్దుచూస్తేగాని భోజనంచేసే అలవాటు లేదు. మీరంతా వుండగా నాకూ బెంగా బాధా దేనికి? .." అంది. కాని ఆమాట నిజంగా అంటున్నట్టుమాత్రం తోచలేదు శశికి. పైగా యీమధ్య ఆరుమాసాలనుంచి సీను తల్లితోకూడా తిరుగుతూండటం మూలాన ఆవిడకి మరీ బాధగా వుందని కూడా గ్రహించింది.

ఎదురింటి విశ్వేశ్వరరావుగారి భార్య పొద్దుటే వచ్చి కూర్చుంది "చూడండి పిన్నిగారూ!... మొన్నపడ్డ వర్షాలకి వంటిల్లు బాగాకూలిపోయింది. దొడ్డంతా పెద్ద అడవి మొక్కలతో నిండింది. మీరు ఎన్నిసార్లు బాగుచేయించినా మొదటికి వస్తోంది. కాస్త ఆ వంటిల్లు మటుకు బాగుచేయిస్తే మీమేలు మర్చిపోలేం..." అని అంది వెంకమ్మగారు. ముసలావిడ తడిబట్ట పిడ్చుకుంటూ పక్కగా పీట జరిపి కూర్చోపెట్టింది.

"ఆ యిల్లు కట్టి ఏ నలభై సంవత్సరాలో జరిగి వుంటుంది...దాన్ని పూర్తిగా విప్పి కట్టించాలని అబ్బాయ్ అంటున్నాడు. దాని సంగతి ఆలోచిస్తున్నాం...అంతా డబ్బుతో పని చూడండి. సంవత్సరం తిరిగేలోపున మాకు తెలీకుండా పెద్ద కర్చులు వచ్చి మీదపడుతున్నాయి...దానికి ఏ పదివేలో చేతిలో పెట్టుకుని ప్రారంభించాలి..." అని అంది.

ముసలావిడ పూర్వీకులంతా ఎదురింట్లోనే వుండేవారు. యిప్పుడున్న యిల్లు ఎవరో కొత్తగా కట్టుకుని డబ్బులేక నాగ్గేళ్ళలో అమ్మి వెళ్ళిపోయారు. అప్పటినించీ యీ యింట్లో వుంటూ ఎదురిల్లు అద్దెకిచ్చారు. పెద్దాయన యీ సంభాషణ విని అన్నారు "యిల్లు యీ మధ్య కొత్త

పేటనులో కట్టగా చూశానమ్మా, యీ యింటికి పెద్ద డాబా వేయించి అది యిలాగే రెండు భాగాలు వుండేట్టు కట్టాలనివుంది... మొత్తంమీద డబ్బు బాగా పెట్టాలి." అని నవ్వారు. వెంకమ్మగారు లేచి వెళ్ళిపోతూ కోడళ్ళిద్దర్నీ చూసి మాట్లాడి వెళ్ళింది.

పెద్దాయన అనటంతోనే ఏ పనీవుండిపోదు. పది రోజుల్లో యిల్లు విప్పించటం మొదలెట్టారు. కోర్టునుంచి రాగానే యీ పనొకటి మిగిలివుంటోంది. చిన్నాయనకి యిలాంటి విషయాలు అంతగా తెలీదు. పైగా ఆఫీసునుంచి రావడమే ఆలస్యం.

చిన్నాయనకి యివాళ జ్వరంగావుంది. శశి చాలా ఖేదపడ్తోంది. జ్వరంకూడా ఏమంత తక్కువగా మాత్రంలేదు. పెద్దావిడ పిల్లలిద్దరికి అన్నాలు అవీ పెట్టి తనదగ్గరే పడుకోబెట్టుకొంది. రాత్రి పది గంటలకి పెద్దాయన మళ్ళా పడుకోబోయేముందు చూడటానికి వచ్చారు. శశి బావగార్ని చూసి లేచి పక్కకి తప్పుకుంది. అందువల్లనే మాటిమాటికి చూసిపోయేందుకు మొహమాటంగా వుంటుంటుం దాయనకి.

"అమ్మ పడుకునట్టుందే శశీ!...నీకు భయంగా వుంటే మీ అక్కయ్యను యిక్కడే పడుకోమని చెప్తాను...ఎలాయినా అమ్మకి ముసలితనం చేత బొత్తిగా నిద్రకి ఆగ లేకుండా వుంది..."

"ఇప్పటిమటుకు ఆయన తెలివిగానే మాట్లాడుతున్నారు. అవుసరమయితే అక్కయ్యను లేపుతాను లెండి" అని అంది మెల్లిగా.

* * *

ఎదురింట్లో వెంకమ్మగారు వుండేందుకు వీలు కాలేదు. కొత్తగా కట్టిన యిల్లు పాలిక పరకకి యిచ్చేందుకు పెద్దాయన ఒప్పుకోలేదు. గౌరీపతి శాస్త్రిగారు అరవై రూపాయ లిచ్చి దిగారు. వారికి కొడుకూ, కూతురు తప్పించి పిల్లలు లేరు. పైగా ఆయన బ్రహ్మసమాజీకుడు. ఈమధ్య రాజకీయ రంగంలో కూడా ఎక్కువగా పని చేస్తున్నారు.

ముసలావిడదగ్గరకి సాయంత్రం గౌరీపతిగారు కూతుర్ని తీసుకుని వచ్చారు.

"మీరు బ్రాహ్మలేనా?"

"మేము నియోగీ బ్రాహ్మలమండీ పిన్నిగారు. అయినా, నాకు అలాటి జాతిమత భేదాలు లేవు. నా సంగతి మీ కింకా తెలియదేమో. వూళ్ళో ఎవరి కే సహాయం కావాలన్నా చేయటానికి సిద్ధుణ్ణి."

"జాతిమత భేదాలు లేకపోవటంవల్ల వచ్చే లాభంమటు కేముంది గౌరీపతిగారు!"

"చూడండి, మనవాళ్ళంతా తురకల యిళ్ళలోనూ కిరస్తానీవాళ్ళ యిళ్ళలోనూ భోజనం మొదలయిన పంక్తి భోజనాలు చేయకూడదని నిరసించారు. దానివల్ల మతభేదాలు కలగటంతోనే సంఘ కట్టుబాటు నిలవదని నా వుద్దేశ్యం. పైగా అర్థంలేని మాటలన్నీ పట్టుకుని ప్రవర్తించటం నాకు చాలా చికాకు."

"ఆలాని తురకలు, కిరస్తానీవాళ్ళు మన ఆచారాలు వ్యవహరిస్తారా చెప్పండి? నుదుట బొట్టు, తల్లో పువ్వులు దేవతారాధన యిలాంటివి...మనం మాత్రం మన హద్దు ఎందుకు పోగొట్టుకోవాలి?" ఏమైనా ముసలావిడతోటి మాటలాడ్డం సామాన్యం కాదు. శశి గౌరీపతిగారి అమ్మాయిని పిల్చి తన గదిలోకి తీసికెళ్ళింది.

"నీ పేరు?"

"నా పేరు ప్రమీల."

"ఏమైనా చదివావా?"

"ఇంటర్‌లో జాయిన్ అయాను...అన్నయ్య బి. ఏ. లో జాయిన్ అయాడు."

"నువ్వు డీక తెవే అన్నమాట మీ అమ్మగారికి. చూడు అక్కయ్యా... పేరు ప్రమీలట. ఇంటర్ చదువుతోంది...మన కేశవుడు వారి అబ్బాయి కన్నా ఒకసంవత్సరం ఎక్కువన్నమాట."

"మీ నాన్నగారు అత్తగారితో వాదనలోకి దిగారల్లేవుందే!" అంది పెద్దావిడ నవ్వాపుకుంటూ.

"మిమ్మల్ని అక్కయ్యా అని పిలవాలని వుంది.. మీరేమైనా అనుకుంటారా?" అంది నవ్వుతూ.

"లేదు...అలాటి అనుకోవడాలు లేవమ్మా మా దగ్గర. మా దగ్గర చనువుగా వుండొచ్చు... కాని మేమంతా మీలా చదువుకున్న వాళ్ళం మటుకు కాదు" అంది శశి నవ్వుతూ.

(ముగింపు వచ్చే సంచికలో) ★